

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మాకు మేమే - మీకు మీరే

**విప్పారిత మొహంతో ఇంట్లోకి** వస్తున్న వాసుని చూసి నిరసనగా చెప్పింది హరిత.

"ఎందుకంత ఆనందం? ఆ దుర్వార్త ఏంటో నాకూ చెప్పండి."

ఫక్కున నవ్వేసాడు వాసు.

"అంటే నేను ఆనందంగా ఉండటం నీకు అంత బాధాకరమా?

"ఆ ఆనందం మీవాళ్ళ గురించే అని నాకు పదేళ్ళ అనుభవం. చెప్పండి ఏమిటి సంగతి?"

"మా అమ్మా నాన్న వస్తున్నారు హరితా."

"ఎందుకు?" విసురుగా ప్రశ్నించింది.

"మా అమ్మా, నాన్న నా ఇంటికి రావడానికి కారణం కావాలా హరితా?" చిన్నబుచ్చుకున్నాడు వాసు.

"మరి? వెళ్ళి ఏడాదికూడా కాలేదు. ఇప్పుడెందుకు రావడం చెప్పు? మనకీ ఖర్చులు పెరిగిపోయాయి. ఇద్దరు గెస్ట్‌లని భరించగలమా?"

"ప్లీజ్ పేరెంట్స్‌ని గెస్ట్స్ అనొద్దు. వాళ్ళు మన కుటుంబ సభ్యులు. అన్నయ్య దగ్గర పదినెలలు ఉండి, మన దగ్గరకి రెండు నెలల కోసం వస్తున్నారు. నువ్వలా మాట్లాడటం ఏమీ బాలేదు."

"ఇండియాలో భరించడం వేరు. యు.ఎస్‌లో భరించడం వేరు. ఛ. వెధవ తద్దినం. ఏటా తప్పడం లేదు" విసురుగా లేచి వెళ్ళిపోయింది హరిత.

విలవిల్లాడిపోయాడు వాసు. కానీ ఆమెకి ఎదురు చెప్పే ధైర్యం లేదు కాబట్టి నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"ఇంతకీ ఎప్పుడు దిగుతున్నారట వాళ్ళు?" ఆ రాత్రి భోజనాల సమయంలో అడిగింది హరిత.

"గురువారం. సెవన్‌టీన్త్."

"ఇదిగో ఇండియా వాళ్ళ ఈ కక్కుర్తికే నాకు ఒళ్ళుమండేది. వీకెండ్స్‌కి టిక్కెట్స్ కొంటే ఓ రెండు వేలు ఎక్కువవుతాయని వీక్‌డేస్‌లో కొంటారు. మనకి సెలవలు తక్కువ అని తెలిసి కూడా ఇబ్బంది పెడతారు. మీ అన్నయ్యకి మరీ కక్కుర్తి." విసుక్కుంది.

"నువ్వు ఇండియన్‌వి కాదా? అంతరిక్షం నుంచి వచ్చావా? పెద్దవాళ్ళని ఎంత మాట పడితే అంత మాట అనద్దు హరితా" హెచ్చరించాడు వాసు.

"చూసావా వాళ్ళు రాకుండానే మనకి గొడవలు. వస్తే రోజూ తగాదాలే. అందుకే నాకు మీ వాళ్ళు ఇష్టంలేదు." అరిచింది హరిత.

"ఇవాళ త్వరగా వస్తావా పనుంది?" మర్నాడు అడిగింది హరిత.

"అలాగే ఏం పని?"

"లాకర్ ఆపరేట్ చెయ్యాలి"

"నాకు తెలిసి ఇప్పట్లో ఫంక్షన్స్ ఏవీలేవే?" సాలోచనగా అడిగాడు వాసు.

"నిజమే కానీ మీ అమ్మగారు నేను ఆఫీస్‌కి వెళ్ళినప్పుడు నా క్లోజెట్ తీస్తే కష్టం. నా నగలు చూసి కుళ్ళుకుంటుంది. పెద్ద కోడలికి లేవే అని బాధపడుతుంది కూడా. అది నాకు ఇష్టంలేదు"

"మా అమ్మకి తెలియని నగలా హరితా!?" బాధగా చెప్పాడు వాసు "మా అమ్మకి నా చిన్నప్పుడు ఎన్ని నగలుండేవో తెలుసా? పంటలు సరిగ్గా పండక, మా చదువులకోసం ఒక్కొక్కటీ కరిగించేసింది. నీకు పెళ్ళనాటికి ఫేషన్‌గా ఉండే సన్నటి గొలుసు తప్ప ఏవీ లేవు. కానీ మా వదిన కలిగినింట్లో పుట్టింది. నిజం చెప్పాలంటే ఈనాటికీ నీకంటే కూడా మా వదినకి ఎక్కువ బంగారం ఉంది. నువ్వు అమెరికాలో ఉన్నంత మాత్రాన ఇండియాలో అందరూ అడుక్కుతింటున్నారు అనుకోవద్దు. పైగా నీ అలమరలు వెదకడం మా అమ్మకేం పని? నోటికొచ్చినట్లు మాట్లాడితే మర్యాదగా ఉండదు. సహనానికైనా ఓ హద్దుంది".

విసురుగా వెళ్ళిపోయాడు వాసు.

"ఈ వీకెండ్ మెయిడ్‌ని వచ్చి ఇల్లు క్లీన్ చేసి వెళ్ళమని ఫోన్ చెయ్యనా? " హరితకి టెక్స్ట్ మెసేజ్ పంపాడు వాసు.

"అవసరంలేదు. గెస్ట్స్ కోసం ఇల్లు సర్దాలి కానీ ఫ్యామిలీ మెంబర్స్ కోసం అక్కర్లేదు. మనం ఉంటున్నట్లే ఉంటారు" రిప్లై ఇచ్చింది హరిత.

ఆ వీకెండ్ వాసు గెస్ట్ రూం సర్దుతాడేమో సాధిద్దాం అని హరిత ఎదురుచూసింది కానీ అతను ఆ జోలికి పోలేదు.

"నీకు ముందే చెపుతున్నాను మీ అమ్మ చేసే ఇండియన్ ఫుడ్ అంతా మీ ముగ్గురే తినాలి. ఆ నూనెలు, కార్బోహైడ్రేట్స్‌కి లావైపోతే కష్టం. నా ఫుడ్ నేను ప్రిపేర్ చేసుకుంటా" చెప్పింది.

"అలాగే" శాంతంగా చెప్పాడు వాసు.

"హాల్లో కూర్చుని అస్తమానం ఆ జెమినీ టీ.వీ చూస్తుంటే తలనొప్పి నాకు. ఒక చిన్న టీ.వి కొని వాళ్ళరూంలో పెట్టు."

"సరే" ఒప్పుకున్నాడు వాసు.

ఆ సాయంత్రం ఓ పోర్టబుల్ టి.వి తెచ్చి గెస్ట్ బెడ్ రూంలో పెట్టాడు. అది పెద్దగా లేకుండా చిన్నగా ఉండటంతో సంతృప్తి చెందిన హరిత ఏమీ మాట్లాడలేదు.

"మీ నాన్న ఖాళీగానే ఉంటారు. ఈవినింగ్ మొక్కలకి నీళ్ళు పట్టమని చెప్పు."

"సరే."

"మీ అమ్మ వంట చేసాక కిచెన్ శుభ్రంగా ఉంచమను. రెండు రోజులకోసారి వాక్యూం చెయ్యమను ఇల్లంతా."

"అదేం? నువ్వు వారానికోసారి చేస్తావుగా?"

"ఏం మీ వదినకి చాకిరీ చెయ్యకుండానే ఉంటున్నారా అక్కడ? మరేం పర్లేదు. రోజూ చేసినా బాధలేదు."

"సరే. ఇంకా ఏమైనా ఉన్నాయా?"

"చాలా ఉన్నాయి. వాషింగ్ మెషిన్‌లో వాళ్ళ బట్టలతో పాటు మన బట్టలు వేయద్దు. నాకు నచ్చదు. విడిగా వేయాలి. ఇంకా వీకెండ్స్ అటూ ఇటూ తిప్పక్కర్లేదు. హైదరాబాద్‌లో ఎవరు తీసుకువెళ్తారు వాళ్ళని?"

"ఓ.కే, అన్నీ గుర్తుపెట్టుకుంటాను. గురువారం హాఫ్ డే లీవ్ తీసుకో ఫ్లయిట్ నాలుగున్నరకి వస్తుంది."

"నేను ఎయిర్ పోర్టుకి రాను. నువ్వెళ్ళి తీసుకురా" తిరస్కరించింది.

"నువ్వు రావాలి. వస్తున్నావ్ అంతే" కఠినంగా చెప్పాడు.

ఎయిర్ పోర్ట్‌లో టెర్మినల్ బయట ధుమధుమలాడుతూ నుంచుని ఇమ్మిగ్రేషన్ పూర్తయి లగేజ్ తీసుకోడానికి వస్తున్న వారిని దూరంనుంచి గమనిస్తుంది హరిత. ఆకుపచ్చచీర కట్టుకున్న ఓ నడివయస్కురాలు, వెనక లాల్చీ పైజమాల్లో ఉన్న వ్యక్తిని చూడగానే ఆమె నోటమాట రాలేదు.

"ఇదేంటి? మీ అమ్మా, నాన్న బదులు మా అమ్మా నాన్నలు వచ్చారు?" సంభ్రమంగా అడిగింది.

"అవును. వచ్చేది నా పేరెంట్స్ కాదు. నీ పేరెంట్సే" జవాబు చెప్పాడు వాసు.

"మరి నాకు ఎందుకలా చెప్పావు?" కోపంగా అడిగింది హరిత.

"నీకు నా వాళ్ళెంతో నీ వాళ్ళూ అంతేనేమో అని సరదాగా చెప్పాను. అదీకాక మీ వదిన 'పదినెలలు నేను భరించాను. కూతురైతే ఏంటి, కొడుకైతే ఏంటి? మీ అమ్మాయి దగ్గరకి వెళ్ళిరండి' అని పంపించిందిట. మీ కక్కుర్తి అన్నయ్య వీకెండ్‌కి టిక్కెట్ కొంటే పద్దెనిమిది వందలు ఎక్కువ పెట్టాలి అని 'ఓ అరపూట సెలవుపెట్టండి బావా' అని చెప్పాడు. పైగా 'మా చిన్నికి చెప్పకండి. అమ్మా, నాన్నలని చూసి అది సర్‌ప్రైజ్ అవుతుంది' అనికూడా చెప్పాడు. అందుకే మీ పేరెంట్స్ కూడా ఫోన్‌లో నీకు చెప్పలేదు" చిన్నగా నవ్వుతూ చెప్పాడు వాసు.

"అయ్యయ్యో వాడో వెధవ! ఎందుకీ సస్పెన్స్‌లు. అమ్మా నాన్నలకి ఏమీ ప్రిపేర్ చేయలేదు. ఇరవైగంటలు కూర్చుని వచ్చారు. బయటి ఫుడ్ నాన్నగారికి పడదు. నీ బుద్దేమైంది వాసూ. నువ్వైనా చెప్పచ్చుగా?" విరుచుకుపడింది.

"నేను నీకు ఇండైరెక్ట్‌గా హింట్ ఇద్దామనే మా అమ్మా నాన్న వస్తున్నారని చెప్పాను. వాళ్ళకి ఏం ట్రీట్‌మెంట్ ఇద్దామనుకున్నావో వీళ్ళకీ అదే ఇవ్వు. వాళ్ళ రూంలోని టీ.వీలోనే జెమినీ ఛానెల్ చూడాలి. హాల్లో పెద్ద టీ.వి పెడితే నీకు తలనొప్పి. మీ మదర్‌ని రోజూ ఇలు వాక్యూం చేయమను. మీ నాన్నగారిని మొక్కలకి నీళ్ళు పట్టమను. వాళ్ళు వెళ్ళేదాకా లాకర్ నుంచి నీ నగలేం తేవద్దు. మీ వదినకి లేవని మీ అమ్మ బాధపడచ్చు పాపం. ఇంకా వాళ్ళిద్దరికే వంటచేసుకోమని చెప్పు. కొలెస్ట్రాల్, కార్బోహైడ్రేట్స్, ఎందుకొచ్చిన గొడవ. నేను నీలాగే లోకేలరీ ఫుడ్ తింటాను. వీకెండ్స్‌లో ఎక్కడికీ వెళ్ళకుండా హాయిగా ఇంట్లోనే కబుర్లు చెప్పుకుంటూ ఉందాం"

నోటమాట రాక మింగేసేలా చూస్తున్న ఆమెని చూసి తను చెప్పేది పూర్తిచేసాడు వాసు.

"ఏం చేద్దాం హరితా తద్దినంలా ఏడాదికోసారి వీళ్ళు తప్పడం లేదు మనకి."

అతన్ని కొరకొరా చూస్తూ 'చిన్నీ' అంటూ ఆప్యాయంగా తల్లి దగ్గరకి పరుగున వెళ్ళింది హరిత.

**(వచ్చే సంచికలో మరో సరిగమ)**